నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, గురువారం 14 మార్చి 2024 JAGTIAL

## ఇళ్లకు పయనం





సామగ్రితో ఇళ్లకు పయనమవుతున్న విద్యార్థులు

ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ముగియడంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు సాయంత్రం తమ ఇళ్లకు పయనమయ్యారు. తమ పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రాగా, సామగ్రి సర్దుకుని ఇంటిబాట పట్టారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రధాన బస్టాండ్లు విద్యార్థులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా కరీంనగర్ బస్టేషన్ రద్దీగా మారింది.

-కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## పసుపు ధర పైపైకి

- మెట్‌పల్లిలో క్వింటాల్‌కు ₹17,505
- మార్కెట్ చరిత్రలో ఇదే రికార్డు రేటు
- ఆనందంలో రైతులు

మెట్‌పల్లి, మార్చి13 : పసుపు ధరలు పైపైకి చేరుతున్నాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో రికార్డు స్థాయికి చేరుతున్నాయి. బుధవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹17,505 పలుకడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పసుపు కాడి (కొమ్ము)కు ఈ ధర పలకడం మార్కెట్ చరిత్రలోనే మొదటిసారి కాగా, కనిష్ఠంగా ₹6 వేలు వచ్చింది. పసుపు గోళ (మండ)కు గరిష్ఠంగా ₹15,555, కనిష్ఠంగా ₹5,146 వేలు, పసుపు చూరకు గరిష్ఠంగా ₹15,100, కనిష్ఠంగా ₹12,550 వేలు పలికింది. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌లో ఇప్పటి వరకు 13,395 క్వింటాళ్ల పసుపు కొనుగోళ్లు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. అయితే పెరుగుతున్న ధరలను చూసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి దిగుబడులు కాస్త తగ్గినా.. ధరలు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయని చెబుతున్నారు.

## సర్కారు దవాఖానలకు జాతీయ గుర్తింపు

- ఉమ్మడి జిల్లాలో మూడు వైద్యశాలలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్



జూలపల్లిలోని ప్రభుత్వ దవాఖాన

జూలపల్లి, మార్చి 13: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు ప్రభుత్వ దవాఖానలకు జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్ వరించింది. గత డిసెంబర్ 29, 30 తేదీల్లో నేషనల్ క్వాలిటీ టీమ్ సభ్యులు దవాఖానలను సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వసతులను పరిశీలించి నివేదికలు రూపొందించారు. అందులో భాగంగా ఎన్‌క్యూఏఎస్ సంస్థ దవాఖానల పనితీరుపై ఫలితాలు విడుదల చేయగా, కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (94 శాతం), జగిత్యాల జిల్లా దొంతాపూర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (93 శాతం), పెద్దపల్లి జిల్లా జూలపల్లి పీహెచ్‌సీ (82.3 శాతం) మార్కులతో సత్తాచాటాయి. ఈ సందర్భంగా మూడు దవాఖానలకు క్వాలిటీ సర్టిఫికెట్లు జారీ చేశారు. జూలపల్లి మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ, సర్కార్ దవాఖానకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం సంతోషంగా ఉందని, వైద్య సేవలు అందించడంలో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు.



# అధినేత కేసీఆర్‌కు జైకొట్టిన గడ్డ

- ఆది నుంచీ బీఆర్‌ఎస్ వెంటే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం
- గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- తాజాగా కదనభేరికి అశేషంగా తరలివచ్చిన జనం
- కేసీఆర్ ఉద్వేగ ప్రసంగానికి ఫిదా
- బహిరంగ సభ సక్సెస్‌తో నయా జోష్
- గులాబీ దళంలో నూతనోత్తేజం
- రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు రెడీ

**ఆది నుంచీ బీఆర్‌ఎస్ వెంటే నడుస్తున్న కరీంనగర్ పార్లమెంట్ మరోసారి అధినేత కేసీఆర్‌కు జైకొట్టింది. రాబోయే లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికలకు ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా శంఖారావం పూరించగా, ప్రజానీకం మద్దతు తెలిపింది. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అశేషంగా తరలివచ్చింది. కదనభేరి సభ విజయవంతం కావడం, అధినేత ప్రసంగం ఉర్రూతలూగించడం, నాటి ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంతో గులాబీదళం నయా జోష్ నింపుకొన్నది. ఈ నూతనోత్తేజంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించే దిశగా సాగిపోతున్నది. సమర్థుడైన బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నది.**

కరీంనగర్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పార్లమెంట్ ఆది నుంచీ బీఆర్‌ఎస్ వెంటే ఉంటున్నది. పార్టీ ఆవిర్భావం మొదలు.. నేటి వరకు ఏ కార్యక్రమం తీసుకున్నా జై కొడుతున్నది. అధినేత కేసీఆర్‌కు అన్ని విధాలా అండగా నిలుస్తున్నది. నాడు 2014 ఏప్రిల్ 13న ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం పూరించగా, పార్టీకి అద్భుత విజయాన్ని అందించింది. ఇప్పుడు అదే నేల నుంచి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు శంఖారావం పూరించగా, మరోసారి తాము గులాబీ పార్టీ వెంటే ఉన్నామని చాటి చెప్పింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన కదనభేరికి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజానీకం అశేషంగా తరలివచ్చి జైకొట్టింది. నిజానికి సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ ఉండగా.. అప్పటికే పెద్ద సంఖ్యలో రావడంతో సభా ప్రాంగణం నిండిపోయింది. అయితే, సభ రెండు గంటలపాటు ఆలస్యమైనా ఆసక్తిగా.. ఉత్సాహంగా ఎదురుచూసింది. అధినేత కేసీఆర్ సభా వేదికపైకి చేరుకోగానే 'జై కేసీఆర్, జై తెలంగాణ' నినాదాలతో మార్మోగించింది. తర్వాత పార్టీ ఆవిర్భావం, ఆనాడు తెలంగాణకు జరిగిన అన్యాయం, స్వరాష్ట్ర ఉద్యమం, రాష్ట్ర సాధన, పదేళ్ల బీఆర్‌ఎస్ సంక్షేమ పాలనపై కేసీఆర్ వివరించిన తీరును చూసి సభికులు జేజేలు పలికారు. అలాగే, రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని కండ్లముందుంచగా.. పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. గులాబీ జెండానే తెలంగాణకు నిజమైన రక్షణ అని తేల్చి చెప్పడంతో సభాప్రాంగణమంతా జై తెలంగాణ నినాదాలతో ప్రతిధ్వనించింది. 'మళ్లీ వెనక్కి పోదామా.. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని ముందుకు పోదామా' అని ప్రశ్నించగా.. గులాబీ జెండాను ఎగురవేద్దామని స్పష్టం చేసింది.

**ఆది నుంచీ వెంటే..**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ బలంగా ఉన్నది. ఏడింటిలో నాలుగు స్థానాలు కోల్పోయి, మూడు స్థానాల్లో విజయ బావుటాను ఎగుర వేసిన గులాబీ పార్టీ.. కాంగ్రెస్ కంటే అధికంగా ఓట్లు సాధించింది. కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలువగా, హుస్నాబాద్, చొప్పదండి, వేములవాడ, మానకొండూర్ నియోజకవర్గాల్లో మాత్రం కాంగ్రెస్ విజయం సాధించింది. కానీ, ఓట్ల పరంగా చూస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థులే ఎక్కువగా సాధించారు. పార్లమెంట్ ఎన్నికల బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని చెప్పడానికి ఇదే నిదర్శనమని నాయకులు చెబుతున్నారు. ఆ అభిమానంతోనే ఇప్పుడు కదనభేరి సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారని అంటున్నారు.

### కార్యకర్తల్లో నూతనోత్సాహం

కరీంనగర్ నేల నుంచి కదనభేరి మోగించడం బీఆర్‌ఎస్ పార్టీకి పునరుత్తేజాన్ని ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భారంతో ఉన్న కార్యకర్తలను సమరశీలురుగా తీర్చిదిద్దేలా అధినేత ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా కొనసాగింది. ఉద్వేగ పూరితంగా.. మళ్లీ ఉద్యమ భాషతో ప్రసంగించడం జనాన్ని ఉర్రూతలూగించడమే కాదు, శ్రేణుల్లో జోష్ నింపుతున్నది. తొమ్మిదేండ్ల తమ పాలన, మూడు నెలల కాంగ్రెస్ పాలన ఎట్లున్నదో కండ్లకు కట్టినట్లు వివరించిన తీరు, ప్రతి కార్యకర్తా అంకుశమై నిలువాలని ఇచ్చిన పిలుపు ప్రభావాన్ని చూపుతున్నది. కీలక అంశాలపై ఆయన మాట్లాడడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. సభకు పెద్ద సంఖ్యలో రావడం, ప్రజల నుంచి ఏ మాత్రం ఆదరణ తగ్గకపోవడం, అధినేతకు జేజేలు పలుకడం చూసి గులాబీ నాయకులు, కార్యకర్తలు నయాజోష్‌లో మునిగిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ ఏం చేస్తుందో తెలియని పరిస్థితి ఉందని, ఇలాంటి సమయంలోనే పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక ఉండాలని పిలుపునివ్వడంతో ప్రతి కార్యకర్త నూతనోత్తేజంతో ముందకు సాగుతున్నారు. తాము ప్రజల పక్షమని చెప్పేందుకు వచ్చిన ఈ సభే రుజువని, రాబోయే ఎన్నికల్లో గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

### తెలంగాణ సోయి ఉన్న నాయకుడు ఉండాలి



2001లో ఉద్యమం ప్రారంభించినప్పుడు నేను కూడా కేసీఆర్‌తో ఉన్న. వేళ్ల మీద లెక్కించే వారిలో నేనూ ఒకడిని. చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్‌కు దశాబ్దకాలంగా ప్రజలు అండగా ఉన్నరు. కాంగ్రెస్ ఆడిన కపట నాటకంతో ఇటీవల ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పక్కకు పెట్టి, అభివృద్ధికి బ్రేకులు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే కేసీఆర్ సర్కారు అమలు చేసిన ప్రజా, రైతు సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేస్తున్నది. ఇలాగే కొనసాగితే, పార్లమెంట్ ఎన్నికల తర్వాత అసలు ఏం జరుగుతుందోననే ఆందోళన తెలంగాణ ప్రజల్లో ఉన్నది. అభివృద్ధిని కొనసాగించాలంటే ఇక్కడ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో లేవనెత్తే మన తెలంగాణపై సోయి ఉన్న నాయకుడు ఉండాలి. ఈ ప్రక్రియను తెలంగాణ ఉద్యమకారుడు, ఉద్యమ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అయితేనే నిబద్ధతతో పూర్తి చేయగలుగుతడు. తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం నిలబడాలంటే ఆయన గెలవాలి.

- వానపట్ల నర్సింహారెడ్డి, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు, అనుపురం, (వేములవాడరూరల్ మండలం)

### కేసీఆర్‌తోనే భరోసా



కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మాకు భరోసా ఇచ్చిండు. రాష్ట్రంలో సాగునీటి సమస్యలు, కరెంటు ఇబ్బందులు లేకుండా చేసిండు. ఇప్పుడు సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నయి. కేసీఆర్ సర్ ఏదో విధంగా పంటలకు మాత్రం సాగునీరు అందించిన్రు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు కాళేశ్వరంలో సమస్య వచ్చిందని నీళ్లు ఇచ్చుడే లేదు. అదే కేసీఆర్ సర్ ఉంటే ఏదో విధంగా సాగునీరు వచ్చేవి. ఉద్యమ సమయంలో కరీంనగర్‌లో సభ జరిగినట్లే ఇప్పుడు ఎంపీ ఎన్నికలకు ముందు ఈ సభ జరిగింది.

- అల్లాడి శ్రీనివాస్, వేములవాడ

## బొమ్మారెడ్డిపల్లికి సాగునీటి గోస



బొమ్మారెడ్డిపల్లిలో ఎండిన పొలంలో ఆవును మేపుతున్న రైతు మహిపాల్ రెడ్డి

**బొమ్మారెడ్డిపల్లి గోసపడుతున్నది. సాగునీరు లేక అల్లాడిపోతున్నది. ప్రస్తుతం ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతుండగా, రైతాంగం ఆందోళన చెందుతున్నది. సాగునీరిచ్చి పంటలను కాపాడాలని వేడుకుంటున్నది.**

ధర్మారం, మార్చి 13: బొమ్మారెడ్డిపల్లి నాగుల చెరువు కింద ఏటా యాసంగిలో 50 ఎకరాలపైనే వరి, మక్క సాగు చేస్తుంటారు. మల్లాపూర్ శివారులోని ఎస్సారెస్పీ డీ83/బీ 1-ఎల్ కెనాల్ నుంచి వచ్చే నీటితోనే ఈ చెరువు నిండుతుంది. చిన్న కాల్వల ద్వారా నీరు ఒర్రెల్లోకి చేరి పంటలకు అందేది. ఏటా ఇదే సమయంలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులు ఏ బాధా లేకుండా సాగు చేసుకున్నారు. ఈ యాసంగిలోనూ నీళ్లు వస్తాయనే నమ్మకంతో వరి, మక్క వేశారు. అయితే 1-ఎల్ కెనాల్ నుంచి అంతంత మాత్రంగానే నీరు రావడంతో చెరువు నిండలేదు. ఒర్రెలు పారలేదు. మరోవైపు భూగర్భజలాలు కూడా అడుగంటి సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయి. రైతు గడ్డం మహిపాల్ రెడ్డి తన రెండున్నర ఎకరాల పొలంలో పశువులను మేపుతుండగా, మరో రైతు మహిపాల్‌రెడ్డి ఎకరం మక్క చేనును పూర్తిగా వదిలేయగా, మిగతా రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. కొందరు పంటలు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తుండగా, మరికొందరు చేసేదేమీ లేక ఎండిన పంటలో పశువులు మేపుతున్నారు. కేసీఆర్ పాలనలో ఏ రందీ లేకుండా పంటలు పండించుకున్నామని, ఇప్పుడు అరిగోస పడుతున్నామని వాపోతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి నాగుల చెరువును నింపి, పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రైతు మహిపాల్ రెడ్డి వ్యవసాయ బావిలో అడుగంటిన భూగర్భ జలాలు

## ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

- మెరుగైన వైద్యాన్ని చేరువ చేస్తం
- దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



శంకుస్థాపన పూజలో మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 13: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. రాష్ట్ర సర్కారు పేదలకు అండగా నిలుస్తున్నదని, ప్రజలందరికీ మెరుగైన వైద్యాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నదని చెప్పారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో సింగరేణి నిధులు ₹142 కోట్ల వ్యయంతో అదనపు 355 పడకల దవాఖాన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామని, జిల్లాలో దాదాపు 2వేల మంది స్కీంను వినియోగించుకున్నట్లు చెప్పారు. త్వరలోనే ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఓసీపీలో స్థానిక యువతకు 80శాతం మేర ఉపాధి కల్పించాలని సింగరేణి సంస్థను కోరినట్లు వివరించారు. అలాగే ఆర్‌ఎఫ్‌సీఏల ఎన్టీపీసీ సంస్థలు కూడా స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించేందుకు నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఇక్కడ మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, రామగుండం సీపీ శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సింగరేణి ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ ఉన్నారు.

## వరదకాల్వకు నీళ్లివ్వాలి


- ఎండిపోతున్న పంటలను కాపాడాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మధురానగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, మార్చి 13 : వరదకాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గంగాధర మండలం మధురానగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో చొప్పదండి నియోజకవర్గం మరో కోనసీమగా మారిందని, వరదకాలువ జీవనదిని తలపించిందని గుర్తు చేశారు. వేలాది ఎకరాలకు సాగునీరందించి, పంటలను కాపాడిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. వరదకాలువకు 25 ఓటీలను నిర్మించి చెరువులను నింపుకొన్నామన్నారు. కానీ, కాంగ్రెస్ పాలనవచ్చి రైతులకు కన్నీళ్లు, కష్టాలను తెచ్చిందన్నారు. మేడిగడ్డ వద్ద ప్రతిరోజూ ఐదువేల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్లు లోకిని ఎల్లయ్య, సాగి మహిపాల్‌రావు, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, ముక్కెర మల్లేశం, నాయకులు దోమకొండ మల్లయ్య, సామంతుల శ్రీనివాస్, సముద్రాల అజయ్, గంగాధర కుమార్, అబ్బాస్, గంగాధర శ్రీకాంత్ పాల్గొన్నారు.

# చేయిపడితే.. కళారూపమే




కళారూపం తయారీలో రజనీకాంత్

- సూక్ష్మ కళలో రాణిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు


**పెన్సిల్ గ్రాఫైట్‌పై తాజ్‌మహల్, వరల్డ్ కప్ నమూనా, బియ్యం గింజపై త్రివర్ణ పతాకం, చాక్‌పీస్‌తో వేలి గోటిపై పట్టే పరిమాణంలో ఒక సెంటీమీటర్ ఎత్తుతో బతుకమ్మ, క్రిస్మస్‌తాత, కేసీఆర్ విగ్రహం.. ఇన్నా ఎన్నో కళారూపాలతో అబ్బుపరుస్తున్నారు ఆర్ట్ టీచర్ ఆడెపు రజనీకాంత్! సూక్ష్మకళలో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.**



చాక్‌పీస్‌లపై కళారూపాలు



చాక్‌పీస్‌పై చెక్కిన శివలింగం



సబ్బు బిల్లపై అమరుల స్తూపం నమూనా

పెద్దపల్లి, మార్చి13 (నమస్తే తెలంగాణ) : 'అగ్గిపుల్ల.. సబ్బుబిల్ల' కాదేదీ కళకు అనర్హం అన్నట్టు సూక్ష్మకళలో రాణిస్తున్నాడు ఓదెల మండలం మడకకు చెందిన ఆడెపు రజనీకాంత్. బ్లాక్ బోర్డుపై రాసేందుకు మాత్రమే ఉపయోగించే చాక్‌పీస్‌తోపాటు ఇంట్లోని అగ్గిపుల్లలు, కోడిగుడ్డు డొల్లలు, పెన్సిల్ మొనలు, బియ్యపు గింజలు, కొవ్వొత్తులతో అతి సూక్ష్మ కళాఖండాలు ఆవిష్కరిస్తున్నారు. 2018లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల కళాశాలలో ఆర్ట్ టీచర్ కొలువు సాధించిన రజనీకాంత్, ఓవైపు టీచర్‌గా పనిచేస్తూనే.. మరోవైపు తన అభిరుచిని చాటుతున్నారు. ఇప్పటి వరకు చాక్‌పీస్‌లతో వివిధ ఆకృతుల్లో 500 రకాల ఆకృతులు చెక్కి ప్రపంచరికార్డులో తన పేరును నమోదు చేసుకున్నాడు. రెండు బియ్యపు గింజలపై 278 ఆంగ్ల అక్షరాలతో జాతీయ గీతం జనగణమనను లిఖించినందుకు గాను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నుంచి 2016లో గ్రామీణ కళా జ్యోతి అవార్డు అందుకున్నారు. ఒక్క బియ్యం గింజపైనే 72 ఇంగ్లిష్ అక్షరాలు రాసి బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్స్ వారి సృజన పుత్ర అవార్డు దక్కించుకున్నారు. పెన్సిల్ గ్రాఫైట్‌పై వినాయక ప్రతిమను చెక్కడంతో రికార్డు హోల్డర్స్ రిపబ్లిక్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. బియ్యపు గింజపై మూడు మిల్లీ మీటర్ల ఎత్తులో త్రివర్ణపతాకాన్ని చెక్కి ఔరా అనిపించారు. అలాగే ఎంతో మహనీయుల విగ్రహాలను సూక్ష్మాతిసూక్ష్మంగా చెక్కి అబ్బురపరిచారు. అంతేకాదు మడక పంచాయతీ, పాఠశాల గోడలపై, పల్లెప్రకృతి వనంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా తన సొంత డబ్బులతో పెయింటింగ్స్ వేశారు. తన కళతో ఎన్నో అవార్డులు పొందారు. రెండు బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, రికార్డ్ హోల్డర్ రిపబ్లిక్ ఇండియా వరల్డ్ రికార్డ్(ఆర్‌హెచ్‌ఆర్) రికార్డులను సొంతం చేసుకున్నారు.

### విద్యార్థులకు ప్రోత్సాహం

విద్యార్థుల్లో సృజనాత్మకను పెంచేలా రజనీకాంత్ వృత్తిని కొనసాగిస్తున్నారు. పేపర్ వర్క్స్, ఒరిగామి, బెస్ట్ ఔట్‌ఆఫ్ వేస్ట్, ట్రైబర్ ఆర్ట్, వార్లి పెయింటింగ్స్, ఐస్‌క్రీం స్టిక్ వర్క్స్, కొలాజ్ పేపర్‌వర్క్స్, మధుబని, నకాశి, కలంకారి వర్క్స్‌ను వారికి నేర్పిస్తున్నారు. చక్కని ఇన్‌పుట్స్ ఇస్తూ రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ప్రతిభను చాటేలా తర్ఫీదును ఇస్తున్నారు.

## ఉన్నత లక్ష్యం వైపు పయనించాలి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ వీనరేందర్‌రెడ్డి, అతిథులు

సుల్తానాబాద్, మార్చి 13 : విద్యార్థులు ఉన్నత లక్ష్యం వైపు పయనించేందుకు ఇష్టపడి చదువును కొనసాగించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో డిజైర్ పేరిట వార్షికోత్సవాన్ని నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతాకృష్ణ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు జడ్పీటీసీ వినుపాల స్వరూపా ప్రకాశ్‌రావు, ఎలిగేడు ఎంపీపీ స్రవంతి, సాయిరి మహేందర్, ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.